క్లుప్తంగా

మున్సిపల్ కార్మికులకు పెరిగిన వేతనాలివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం పెంచిన రూ.1000 వేతనాన్ని ఈ నెల ఇచ్చే వేతనాలతో కలిపి అందించాలని కోరుతూ కార్మిక సంఘం యూనియన్ గౌరవ అధ్యక్షుడు రామగిరి బానేశ్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన చైర్మన్‌ను సన్మానించిన అనంతరం వయస్సు పైబడిన వారి స్థానంలో కుటుంబంలోని ఒకరికి ఆ ఉద్యోగాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చిప్పకుర్తి నర్సయ్య, మాడుగుల నవీన్, కోకిల శ్రీనివాస్, మోకిన సత్తయ్య, సుమన్, అశోక్, రత్నం, దుర్గమ్మ, తిరుమల, సుగుణ, రాయమల్లు, లింగయ్య, రామచందర్, రమేశ్, నగేశ్, సది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మందమర్రిరూరల్: మండలంలోని మామిడిగట్టు గ్రామంలోని రేషన్‌షాపు డీలర్ నిబంధనలకు అనుగుణంగా షాపు తెరవడం లేదని, లబ్ధిదారులకు సరిగా బియ్యం పంపిణీ చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆరు నెలల క్రితం కొత్తగా రేషన్ షాపు దక్కించుకున్న వారు లబ్ధిదారులను ఇష్టారీతిగా తిడుతున్నారని, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా కనీసం తనిఖీ చేయడం లేదని ఆరోపించారు. కొత్తగా డీలర్ షిప్ పొందినవారు కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే మామిడిగట్టులోని రేషన్‌షాపును ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులకు సరిగ్గా బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దండేపల్లి ఎస్సైగా నరేష్



దండేపల్లి: దండేపల్లి ఎస్సైగా కె.నరేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై ప్రసాద్ మంచిర్యాలకు బదిలీ కాగా, కన్నెపల్లి ఎస్సైగా పనిచేసిన నరేష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు.

శివాజీ విగ్రహం పెట్టాలి

మంచిర్యాలటౌన్: శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీన మంచిర్యాలలో ఆయన విగ్రహాన్ని పెట్టాలని విగ్రహ సాధన సమితి సభ్యులు మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిమాండ్ చేశారు. హిందువుల చిరకాల కోరిక మేరకు మూడు సంవత్సరాలుగా పర్మిషన్ల కోసం అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా అనుమతులివ్వడం లేదన్నారు. ఈ నెల 19వ తేదీన అనుమతులు ఇవ్వడంతో పాటు, విగ్రహస్థాపన కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విగ్రహ సాధన సమితి సభ్యులు కర్ణకంటి రవీందర్, రామగిరి శ్రీనివాస్, అమిత్ కృష్ణ, మణికంఠ, సందేశ్ గుప్తా, శ్రీకాంత్, హరికృష్ణ, రాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి టేకుల బస్తీకి చెందిన ఆటో డ్రైవర్ గోసిక సుధాకర్(38) గుండెపోటుతో మరణించాడు. కుటుంబీకుల కథనం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజాము 2–30గంటల ప్రాంతంలో సుధాకర్‌కు గుండెపోటు వచ్చింది. వెంటనే అతడి భార్య స్వర్ణలత, కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సుధాకర్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థికి సన్మానం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి శాంతిఖని బస్తీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.సాయి దీక్షిత్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయిదీక్షిత్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నారాయణ, ఉపాధ్యాయులు శాలువా కప్పి ప్రశంసించారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణ ప్రగతికి బ్రేక్



చెన్నూర్ లైన్‌గడ్డలో చెత్తా చెదారంతో నిండిపోయిన మురుగు కాలువ

- ఆరు నెలలుగా నిలిచిన నిధులు
- మున్సిపాలిటీల్లో కుంటుపడ్డ అభివృద్ధి

చెన్నూర్: మున్సిపాలిటీల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టింది. తొలుత నెలనెలా నిధులు విడుదల చేసింది. రెండేళ్ల నిధుల విడుదల సక్రమంగానే సాగింది. దీంతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడంతోపాటు వివిధ పనులు చేపట్టారు. అయితే గతేడాది సూలై నుంచి పట్టణ ప్రగతి నిధులకు బ్రేక్ పడింది. మంచిర్యాల మున్సిపాలిటీకి జూన్ నుంచి నిధులు నిలిపోగా, బెల్లంపల్లి మున్సిపాలిటీకి ఏప్రిల్, మందమర్రి, నస్పూర్, చెన్నూర్ లక్సెట్టిపేట మున్సిపాలిటీకి జూలై నుంచి నిధులు విడుదల ఆగింది. దీంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలకు జనాభా ప్రతిపాదికన గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పట్టణ ప్రగతిలో విడుదల చేసిన నిధులతో ఆయా మున్సిపాలిటీలో పారిశుధ్యం, హరితహారం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. చిన్న మున్సిపాలిటీలకు రూ.50 లక్షలకుపైగా రావాల్సి ఉండగా మంచిర్యాల, నస్పూర్, బెల్లంపల్లి మున్సిపాలిటీలకు కోట్ల రూపాయల బకాయి ఉంది. దీంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదని అధికారులు పేర్కొంటున్నారు.

ఇతర నిధుల కోసం..

పట్టణ ప్రగతి నిధులు ఆరు నెలలుగా అగిపోవడంతో ఇతర నిధుల నుంచి పనులు చేపట్టాలంటే కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేయాల్సిన అవసరం ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో జనరల్ ఫండ్ నిధులు వినియోగిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో పనులు మందుకు సాగడం లేదు. పట్టణ ప్రగతి నిధులు రెండు విడుతులుగా రాకపోవడంతో చిన్న మున్సిపాలిటీలలో పనులు చేపట్టలేకపోతున్నారు. మున్సిపాలిటీల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

మున్సిపాలిటీల వారీగా ప్రతినెల రావాల్సిన నిధుల వివరాలు..

మంచిర్యాల	32 లక్షలు
నస్పూర్	23 లక్షలు
బెల్లంపల్లి	19 లక్షలు
మందమర్రి	18 లక్షలు
క్యాతన్‌పల్లి	13 లక్షలు
చెన్నూర్	9 లక్షలు
లక్సెట్టిపేట	8.66 లక్షలు

పనులు చేపడుతున్నాం..

పట్టణ ప్రగతి నిధులు ఆరు నెలలుగా రావడం లేదు. నిధులు నిలిచిపోయినా పారిశుధ్య పనులు చేపడుతున్నాం. కొత్త పనులు చేపట్టలేక పోతున్నాం. నిధులు విడుదలైతే కౌన్సిల్ తీర్మానం మేరకు పనులు చేపడుతాం

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్ చెన్నూర్

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



మాదాపూర్‌లో డ్రెయినేజీలు పరిశీలిస్తున్న డీపీవో



బహుమతులు ప్రదానం చేస్తున్న రాకేష్ శర్మ

- డీపీవో వెంకటేశ్వర్లు

దండేపల్లి: ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని డీపీవో వెంకటేశ్వర్లు సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా దండేపల్లి మండలం మేదరిపేట పంచాయతీ పరిధిలోని మాదాపూర్ గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్లాస్టిక్ వాడితే కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అనంతరం మేదరిపేటలో కిరాణ దుకాణాలను తనిఖీ చేసి, ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ సంచులు వాడితే జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. దుకాణాల్లో బట్టసంచులు వాడాలన్నారు. ఆయన వెంట జీపీ ప్రత్యేకాధికారి సంధ్యారాణి, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య పనులు పర్యవేక్షించిన డీపీఓ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామాల పరిశుభ్రత లక్ష్యంగా గ్రామాల్లో చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వెంకటేశ్వర్‌రావు ఆకస్మికంగా పర్యవేక్షించారు. గుడిపేట, నంనూర్ గ్రామాల్లో చేపడుతున్న పనులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. స్థానికులను భాగస్వాములను చేస్తూ గ్రామాల వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న ఇంటి పన్నుల వసూళ్లను కూడా డీపీఓ వెంకటేశ్వర్‌రావు పరిశీలించి పన్నుల లక్ష్యం వందశాతం చేరుకునేలా కృషి చేయాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

భీమారం: మండలంలోని బూరుగుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మండల పశు వైద్యాధికారి రాకేష్ శర్మ మాట్లాడుతూ..ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు చెప్పి, ప్లాస్టిక్ నివారణకు పాటుపడాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో వందశాతం హాజరు ఉన్న విద్యార్థులకు రాకేష్ శర్మ తన సొంత ఖర్చులతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే జరిమానా

వేమనపల్లి: దుకాణదారులు ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్లపై పడేస్తే జరిమానా తప్పదని ప్రత్యేక అధికారి, ఎంపీఓ బాపురావు అన్నారు. నీల్వాయి గ్రామ పంచాయతీలో ప్రజలకు, దుకాణయజమానులకు మంగళవారం ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ బదులు బట్ట సంచులు ఉపయోగించాలని, వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వివేకానంద్‌రెడ్డి



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో అంతా భాగస్వామ్యం కావాలని సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గుర్రం వివేకానంద్‌రెడ్డి అన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలపై వాహనదారులకు, వాహన చోదకులకు ఎంవీఐ వివేకానంద్‌రెడ్డి అవగాహన కల్పించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, చిన్నారులకు వాహనాలకు ఇవ్వకుండా నియంత్రించడం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు వాటిపై ప్రతి ఒక్క రూ చైతన్యం కావాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు చాలా జరుగుతున్నాయన్నారు. రవాణా శాఖా చేపట్టే వాహన తనిఖీల్లో నిబంధనలు అతిక్రమించినట్లు తేలితే భారీ జరిమానాలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే భద్రత'

మంచిర్యాలక్రైం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రయాణంలో భద్రత ఉంటుందని స్థానిక ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అధిక శాతం రోడ్డు ప్రమాదాలు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్లనే జరుగుతున్నాయన్నారు. రహదారులపై ప్రమాదాల నివారణకు పలు రకాల సూచిక గుర్తులపై అవగాహన లేకపోవడమేనన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. బైక్ ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్లనే ఎక్కువ శాతం మృతి చెందుతున్నారన్నారు. వాహనాలకు పత్రాలు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ ఖచ్చితంగా ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. అనంతరం సీఐ నరేష్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీ.చక్రపాణి, సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రామకృష్ణ, సంతోష్, శ్రీనివాస్, శంకరయ్య, మహేష్ పాల్గొన్నారు.

నేషనల్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలోని మౌంట్ కార్మల్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.దీక్షిత నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. గతేడాది డిసెంబర్ 20న జైపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో జరిగిన నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో అండర్–16 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ నెల 16 నుంచి 18 వరకు గుజరాత్‌లో జరగనున్న నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనేందుకు బయలుదేరింది. ప్రిన్సిపాల్ సిస్టర్ ఆల్ఫీ, పీఈటీ నరేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

'ఉద్యమానికి మద్దతివ్వాలి'

పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి మంగళవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణను కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు ప్రకటించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మత్తమాల పుల్లయ్య, జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

మంచిర్యాలటౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టులు మౌనిక, లిటరసీ లిప్సికలు జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మహిళా సాధికారతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బేటీ బచావో, బేటీ పడావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567, సైబర్‌క్రైమ్ నంబర్ల గురించి వివరించారు.

పరీక్షల్లో విజయంపై...

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల కళాశాలలో పరీక్షల్లో విజయంపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో.. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఉప న్యాసకుడు మద్దినేని అర్జున్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరీక్షల ముందు విద్యార్థులు పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సున్నంబట్టివాడ సమీపంలో ఈ నెల 2న జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నస్పూర్‌కు చెందిన వెల్పుల విజయ్(18)కి తీవ్రగాయలయ్యాయి. గాయపడిన విజయ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న విజయ్‌కుమార్

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. సెంట్రల్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ రిటైర్డు ఇంజనీర్ చెలప్ప విజయ్‌కుమార్ తన సొంత డబ్బులు రూ.6లక్షలతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు విజయ్‌కుమార్ స్వయంగా పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్ మాట్లాడుతూ.. దాత విజయ్‌కుమార్ అందజేసిన నిధులతో మూడు తరగతి గదులకు ఉన్న గూన పెంకుల్ని తొలగించి కూలింగ్ రేకులతో పైకప్పు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాఠశాల క్రీడా మైదానానికి ప్రహరీ నిర్మాణం, ఫెన్సింగ్ వేయిస్తామని వివరించారు. దాత గతంలో పాఠశాలకు రూ.30వేల విలువ కలిగిన సైన్స్ మెటీరియల్, బాలికల కోసం రూ.70వేలతో వాష్ రూమ్‌పై రేకులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుధాకర్, రవి, సత్యనారాయణ, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత నెన్నెల



క్రీడాకారులతో ఎస్సై, తహసీల్దార్

నెన్నెల: మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో పుప్పల రఘు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ టోర్నీలో 40జట్లు పాల్గొనగా నెన్నెల జట్టు విజేతగా, కన్నెపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.15వేలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.7,500లను ఎస్సై శ్యాంపటేల్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్‌గా నెన్నెల జట్టుకు చెందిన పాల్తే రాకేష్‌కు షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులు తమ ఆట తీరును మెరుగుపర్చుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరధారుఢ్యం జరుగుతుందని, నిత్యం క్రీడలను ఆడి తమ ఫిట్‌నెస్‌ను పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు ప్రవీణ్, సర్వర్, సతీష్, అరుణ్, నరేష్‌లను అభినందించారు. త్వరలోనే పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాగర్ గౌడ్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌గౌడ్, ఆర్‌వి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పతకం



అభినందిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 10 వరకు బెంగళూర్‌లో నిర్వహించిన సౌత్ జోన్ నేషనల్ ఓపెన్ టాలెంట్ హంట్ పోటీల్లో హాజీపూర్ మండలం గుడిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఉగ్గె ఇంద్రవర్మ 66–70 కిలోల జూనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. మంగళవారం నస్పూర్ ఐడీఓసీలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఇంద్రవర్మను రెవెన్యూ అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అక్షరాస్యత అధికారి పురుషోత్తం, పాఠశాల ప్రిన్సిపాల్ శేరు శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయుడు, బాక్సింగ్ కోచ్ దేవేందర్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్ చేస్తే చర్యలు తప్పవు

చెన్నూర్: అమ్మాయిలతో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని చెన్నూర్ సీఐ రవీందర్ అన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మోటర్ సైకిళ్లకు మోడిఫైడ్ సైలెన్సర్ ఏర్పాటు చేసుకొని స్కూల్స్, కళాశాలలు, మార్కెట్ ప్రాంతాలలో వాహనాలను వేగంగా నడుపుతూ విద్యార్థులను ఈవ్‌టీజింగ్ చేస్తున్న ఇద్దరు యువకులను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చామని తెలిపారు. పోలీసుస్టేషన్‌లో సీఐ వారి తల్లిదండ్రుల ఎదుట కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. మొదటి తప్పుగా కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు. పట్టణంలో మోటర్ సైకిళ్లకు మోడిఫైడ్ సైలెన్సర్లు బిగించుకొని విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే వాహనాన్ని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలు, మార్కెట్ ప్రాంతాలలో పోలీసులు మఫ్టీలో పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బెల్లంపల్లి/పాతమంచిర్యాల/బెల్లంపల్లిరూరల్/కాసిపేట/చెన్నూర్/నెన్నెల/శ్రీరాంపూర్: ఈ నెల 16న జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కార్మికులతో కలిసి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఆర్ఎంవో శ్రీమన్నారాయణకు సమ్మె నోటీస్ అందజేశారు. బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఏపీఎం శ్యామలకు సమ్మె నోటీసు అందజేశారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించి మున్సిపల్ ఏఈ సందీప్‌కు సమ్మె నోటీసు అందజేశారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్ విడుదల చేశారు. చెన్నూర్‌లో ప్రజా సంఘాల నాయకులు, నెన్నెలలో ఐకేపీ వీఓ ఏలు, శ్రీరాంపూర్‌లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు సీసీసీ కార్నర్‌లోని ఆ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్ విడుదల చేశారు.

కొనసాగిన గురుకుల ఉద్యోగుల నిరసన

బెల్లంపల్లి: సమస్యల పరిష్కారం కోసం వినూత్న రీతిలో ప్రభుత్వ గురుకుల ఉద్యోగులు నిరసన చేస్తున్నారు. గురుకులాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఇచ్చిన రాష్ట్ర పిలుపులో భాగంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలు మంగళవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. బెల్లంపల్లిలో ఉన్న ప్రభుత్వ సాంఘికసంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల, సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల కళాశాల ఉద్యోగులు, సిబ్బంది నిరసన కార్యక్రమాల్లో సంపూర్ణంగా పాల్గొంటున్నారు. కార్యక్రమంలో భాగంగా మూకుమ్మడిగా విధులకు సెలవు పెట్టిన ఉద్యోగులు విధులకు హాజరై విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ తమదైన పంథాను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాల్స్ ఐనాల సైదులు, సంతోష్‌కుమార్, స్వరూప మాట్లాడుతూ.. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లడానికి ఉద్యోగులు సామూహికంగా సెలవుపెట్టి నిరసన చేస్తుండగా, అదే తీరుగా విధులకు హాజరై విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగకుండా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

టీఎన్జీవోస్ కేంద్ర సంఘ కార్యదర్శికి సన్మానం

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మంచిర్యాల జిల్లా నూతన కమిటీ ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో సన్మానించారు.

సరోజినీ నాయుడు జయంతి

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. సరోజినీ నాయుడు కీర్తిని కొనియాడారు.

డైరీ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మంగళవారం కేపీపీఎస్ డైరీని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం

భీమారం: మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు.

వెల్గనూర్‌లో కాంప్లెక్స్ సమావేశం

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి మాట్లాడారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

ఏఐఎస్‌బీ పట్టణ కమిటీ ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణ అల్ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) నూతన కమిటీని బుధవారం జిల్లా బాధ్యుడు సన్నీ గౌడ్ ప్రకటించారు. పట్టణ అధ్యక్షునిగా జతిన్‌గౌడ్, కార్యదర్శిగా సిద్ధార్థ, ఉపాధ్యక్షులుగా అరుణ్, సహాయ కార్యదర్శిగా నవీన్‌ను ఎన్నుకున్నారు.

మేడిగడ్డకు కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మేడిగడ్డ ప్రాజెక్ట్ సందర్శనకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. జిల్లా కేంద్రం నుంచి, హాజీపూర్ మండల కేంద్రం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో కార్యకర్తలు మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, ఉపనయన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899